

ఆలయాల్లో శ్రావణ సందడి 6లో..

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం 8లో..

రీ ఫిల్లింగ్ దందా

- యథేచ్ఛగా గ్యాస్ అక్రమ వ్యాపారం
- సబ్సిడీ పక్కదారి
- కమర్షియల్, మినీ సిలిండర్లలోకి ఫిల్లింగ్
- పట్టణాల్లో బహిరంగంగానే విక్రయాలు
- పట్టించుకోని సివిల్ సప్లయిస్ అధికారులు





జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సబ్సిడీ గ్యాస్ రీ రిఫిల్లింగ్ దందా జోరుగా సాగుతోంది. జనావాసాల మధ్య అక్రమ దందా నడుస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాల్లో, పలు మండల కేంద్రాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. పలు గ్యాస్ ఏజన్సీల నిర్వాహకులు, గ్యాస్ డెలివరీ చేసే బాయ్స్ అక్రమార్జనకు తెరలేపి సబ్సిడీ గ్యాస్ పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సబ్సిడీ గ్యాస్ పక్కదారి...

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తుండడంతో రీ రిఫిల్లింగ్ దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. గ్యాస్‌ను తక్కువగా వినియోగించుకునే వారిని గ్యాస్ డెలివరీ బాయ్స్, ఏజెన్సీ నిర్వాహకులు గుర్తించి వారిచే గ్యాస్ బుక్ చేపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సిడీని మీరే తీసు కోండి అని వినియోగదారులకు ఆఫర్ ఇచ్చి గాలం వేస్తున్నారు. దీంతో వారి వైపు మొగ్గు చూపి గ్యాస్ బుక్ చేస్తున్నారు. ఇలా వచ్చిన గ్యాస్ సిలిండర్‌ను రీ రిఫిల్లింగ్, వాణిజ్య అవసరాలకు వినియోగించుకునే వారికి డిమాండ్‌ను బట్టి రూ. 1,100 నుంచి రూ. 1,500కు విక్రయిస్తున్నారు. వీరి అక్రమాలపై నిఘా పెట్టి నియంత్రించాల్సిన అధికారులు ముడుపులు తీసుకొని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదనపు డబ్బులు గడించడానికే...

పలు ప్రాంతాల్లో కార్మికులు, బ్యాచ్‌లర్‌లు, స్థానికేతరులు, పేదలు అధికంగా ఉంటున్నారు. వీరిలో చాలా మందికి స్థానికంగా గ్యాస్ కనెక్షన్లు లేక పోవడంతో మార్కెట్‌లో సులభంగా దొరికే చిన్న సిలిండర్లను వినియోగిస్తున్నారు. చిన్న సిలిండర్ల అమ్మకందారులు సబ్సిడీ గ్యాస్‌ను తమ అక్రమ వ్యాపారానికి వాడుతున్నారు. ప్రభుత్వం అందించే గ్యాస్ బండలో సుమారు 14.5 కిలోల వరకు గ్యాస్ ఉంటుంది. వీటి నుంచి చిన్న సిలెండర్ లోకి రెండు, రెండున్నర కిలోల గ్యాస్ నింపి రూ. 125 నుంచి రూ. 150 వరకు విక్రయిస్తున్నారు. అదనంగా డబ్బులు గడించడానికి పలువురు వ్యాపారులు అక్రమ దందా చేస్తున్నారు.

అంతా బహిరంగమే...

పట్టణ, మండల కేంద్రాల్లో పలు దుకాణాల వారు, వాహనాల్లో గ్యాస్ రీ రిఫిల్లింగ్ చేసే వారు అంతా బహిరంగంగానే ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి చిన్న సిలిండర్లను కొనుగోలు చేసి జిల్లాకు తరలించి వ్యాపారం చేస్తున్నారు. గ్యాస్ రీ రిఫిల్లింగ్ చేసే వారు ముందుగా గ్యాస్ డెలివరి వ్యక్తులకు అడ్రస్ చెప్పి వారి వద్ద గ్యాస్‌ను డెలివరీ చేయించి ఆ తరువాత అక్రమ దందాకు పాల్పడుతున్నారు. మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు, ఉన్నత చదువుల కోసం వివిధ గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి, పట్టణ ప్రాంతాలకు వస్తున్న యువకులు, విద్యార్థులు, ఒంటరి మహిళలు, కుమారుల నిరాదరణకు గురైన వృద్ధులు మినీ సిలిండర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీరి అవసరాలను ఆసరా చేసుకొని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రమాదం అని తెలిసినా...

జిల్లా వ్యాప్తంగా సుమారు వంద వరకు అక్రమ సిలిండర్ రీ రిఫిల్లింగ్ కేంద్రాలున్నట్లు అనధికార అంచనా ఉంది. ఇక్కడ చాలా వరకు వ్యాపార కేంద్రాల్లో అన్ని వస్తువుల మాదిరిగానే చిన్న సిలెండర్ల అమ్మకాలు సాగిస్తున్నారు. సబ్సిడీ సిలెండర్ నుంచి చిన్న సిలెండర్‌లోకి గ్యాస్‌ను రీ రిఫిల్లింగ్ చేయడం ప్రమాదకరమైనప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో గతంలో పలు ప్రమాదాలు జరిగినా..అక్రమార్కులు సులభంగా వచ్చే ఆదాయం కోసం ఈ దందాను నడుపుతున్నారు. రీ రిఫిల్లింగ్ కేంద్రాలు జనావాసాల మధ్య సాగుతుండడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ అక్రమ వ్యవహారంపై దృష్టి సారించాల్సిన పౌరసరఫరాల శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులు, సిబ్బంది నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

ఇప్పటి కైనా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి అక్రమ వ్యాపారాన్ని అరికట్టాల్సిన అవసరముంది.

దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాము

వెంకటేశ్వర్ రావు, జిల్లా సివిల్ సప్లయి శాఖ అధికారి

జిల్లాలో సబ్సిడీ గ్యాస్ రీ రిఫిల్లింగ్ ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదు. అక్రమ దందా గురించి ఎవరైనా మా దృష్టికి తీసుకవస్తే చర్యలు తీసుకుంటాము. సబ్సిడీ గ్యాస్‌ను రీ రిఫిల్లింగ్ చేయడం ప్రమాదకరం. అక్రమాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తున్నాము.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు

- సీజనల్ వ్యాధులబారిన పడుతున్న వారిపై శ్రద్ధ చూపాలి
- కలెక్టర్ సత్యప్రసాద్



ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, ఆగస్టు 19 : ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీసేవలు, ల్యాబ్ రికార్డ్సు, మెడికల్ ఫార్మసీని పరిశీలించారు. ఆస్పత్రిలో స్టాక్ పొజిషన్, సీజనల్ వ్యాధు లైన డెంగ్యూ, మలేరియా ప్రసూతిసేవల పేషెంట్లకు ఇబ్బందులు కలగకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు. డెంగ్యూ కేసుల ద్వారా పెద్దగా ఎవరు అడ్మిట్ కాలేదని, జ్వరాలతోనే అడ్మిట్ అయ్యారని కలెక్టర్ తెలిపారు, శుభ్రమైన నీరు రోగులకు అందిస్తున్నారో లేదో రోగులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పేషంట్ల వివరాలను వారి ఆరోగ్య పరిస్థితి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సమస్యలను తన దృష్టికి తేవాలని సిబ్బందికి సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉంటుందన్నారు. నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అందు బాటులో వైద్యులు, సిబ్బంది ఉన్నారా లేదా అని అటెండెన్స్ రిజిష్టర్ పరిశీలించారు. వైద్యుల తీరు, ఇతర సిబ్బంది తీరు పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుబాటులో లేని వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ల్యాబ్‌లోని రికార్డ్సు, రక్తపరీక్షల నమూనాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సమియొద్దిన్, ఆర్‌ఎంవో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

రాఘువుపేటలో రైతుల దీక్ష



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

మల్లాపూర్, ఆగస్టు 19 : ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మల్లాపూర్ మండలం రాఘవుపేట గ్రామంలో రైతు సమన్వయ సమితి నాయకులు సోమవారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ అర్హులకు ఎందుకు మాఫీ కాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ కట్ ఆఫ్ డేట్లు లేకుండా, ఏలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వెంటనే వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, అలాగే ముత్యంపేటలోని ఇండియన్ బ్యాంకులో ఉన్న కట్ ఆఫ్ తేదీ సమస్యలను పరిష్కరించి రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ రైతుల వద్దకు వచ్చి దీక్ష విరమించాలని కోరారు. తమ సమస్యలపై వ్యవసాయాధికారులు స్పష్టమైన వైఖరి తెలిపే వరకూ దీక్ష విరమించేది లేదని సీఐ, ఎస్సైలకు రైతులు రాఖీలు కట్టి సహకరించాలని కోరారు. విషయం తెలుసుకుని దీక్షా శిబిరానికి వచ్చిన తహసీల్దార్, ఏవో లావణ్య రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని, వారం రోజుల్లో ఇంటింటికీ వచ్చి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్ సైట్‌లో పొందు పరుస్తామన్నారు. అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి రైతులకు ఏవో లావణ్య రాఖీ కట్టి దీక్షను విరమింపజేయించారు. రైతులు మాట్లాడతూ నెల రోజుల్లో ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని, లేని యెడల ఆమరణ దీక్షను చేస్తామన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ఆలయాల్లో పౌర్ణమి పూజలు



కలెక్టర్ సత్య ప్రసాద్‌కు రాఖీ కడుతున్న బాలసదన్ చిన్నారులు

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అక్కా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాలు రాఖీ పండుగ సందర్భంగా కిటకిటలాడాయి. ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికులు కిక్కిరిసారు. పట్టణంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి ప్రవీణ్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైద్రాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌కు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ రాఖీ కట్టారు. జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్ హైద్రాబాద్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న ఓ జవానుకు రాఖీ కట్టారు.

- రాఖీ పండుగ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో, బేటి పడావో పథకంలో భాగంగా బాలసదన్ చిన్నారులతో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్ తదితరులకు చిన్నారులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

24 ఏళ్ల తర్వాత..రక్షాబంధన్ వేడుకలో...

కోరుట్ల : ఉపాధి నిమిత్తం బేహ్రియిన్ వెళ్లి జీవనం గడుపుతున్న ఎన్‌ఆర్‌ఐ 24 తరువాత రక్షాబంధన్ వేడుకలో పాల్గొనడంతో ఆ కుటుంబ సభ్యులు సంతోషంలో మునిగిపోయారు. పట్టణంలోని పద్మపురి కాలనీకి చెందిన రాదారపు సతీష్ కుమార్ 24 ఏళ్ల నుంచి బహ్రియిన్ దేశంలో ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు చెల్లెలు అనూష, అనిత ఉన్నారు. ప్రతి సారి పండుగకు చెల్లెళ్ల కోరియర్ ద్వార రాఖీ పంపిస్తే కట్టుకునే వాడు. ఈ సంవత్సరం చెల్లెళ్ల కోరిక మేరకు రక్షాబంధన్ కోసం స్వగ్రామానికి చేరుకున్నాడు. చెల్లెలు సతీష్‌కుమార్‌కు రక్షను కంటి అన్న చెల్లెళ్ల అనుబంధం చాటుకున్నారు.

ఘనంగా యజ్ఞోపవీతధారణ

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక బ్రాహ్మణ సంఘంలో వేదపండితులు కాసర్ల వంశీ కృష్ణ, కొరిడె చంద్రశేఖర్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఉపాకర్మ ఉత్సవం జరిపారు. అనంతరం యజ్ఞోప వీతాధారణ చేశారు. పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు రామయ్య, ప్రధాన కార్యదర్శి గిరిధర్, సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

- క్షేత్రంలో శ్రీ వైష్ణవులు, పద్మశాలిలు యజ్ఞోపవీతధారణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించుకున్నారు. ఉదయం తమ ఇళ్లలో, శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలి కులస్థులు యజ్ఞోపవీతధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



కోరుట్లలో చెల్లెళ్లతో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఐ



దర్మపురి బ్రాహ్మణ సంఘంలో యజ్ఞోపవీతధారణ కార్యక్రమం

బ్యాంకుల వద్ద పోలీసుల బందోబస్తు

మల్లాపూర్, ఆగస్టు 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ప్ర క్రియ పూర్తి చేసినప్పటికీ అర్హులైన రైతులకు కాలేదని బ్యాంకుల వద్ద నిరసన కార్యక్ర మాలు చేపట్టకుండా ముందస్తుగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మండలంలోని మొగిలిపేట, ముత్యంపేట, మల్లాపూర్ గ్రామాల్లోని కెనరా బ్యాం కులు, సొసైటీ బ్యాంకుల వద్ద సోమవారం పెట్రోలింగ్ చేపట్టారు. రుణమాఫీ కాలేదని మండలంలోని రైతు లు పెద్దఎత్తున బ్యాంకుల ఎదుట, రోడ్డుపై నిరసన కార్యక్రమాలు చేప ట్టుతున్నారు. దీంతో బ్యాంకులోని సేవలకు ఇబ్బందులు కలుగుతున్నాయని నిర్వహకులు తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయాధికారుల సూచనల మేరకు బ్యాంకుల బందోబస్తును పోలీసులు చేపట్టారు. అధికారులు రుణమాఫీ కానీ రైతులు ఇబ్బందులు పడకుండా నిబంధనలు తెలుపుతూ ఎలాంటి అపోహలకు పోవద్దని సూచిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

నేడు కథలాపూర్‌లో బీఆర్‌ఎస్ మహాధర్నా

కథలాపూర్, ఆగస్టు 19 : ఈ నెల 20న మండల కేంద్రంలో రైతులతో మహాధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి తెలిపారు. కాంగ్రెస్ సర్కారు ఎలాంటి షరతులు లేకుండా రు. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసగించిన నేపథ్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. రుణమాఫీ కాని రైతులను భారీ సంఖ్యలో తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి కోమటి రెడ్డిని కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే



మంత్రికి పూలమొక్క అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సో మవారం ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కలిశారు. హైద్రాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వ కంగా కలిసి పూల మొక్క అందించారు. జగిత్యాల నియోజకవర్గంలో పలు నూతన రహదారులు, వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరా రు. ఇందుకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించి నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

- పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు కాసుగంటి సుధాకర్ రావు అనారోగ్యంతో బాధపడుతుండగా హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణలు కలిసి పరామర్శించారు.

గంటపాటు..విడవకుండా వాన

- జలమయమైన రహదారులు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు



వర్షపు నీటితో నిండిపోయిన జగిత్యాల టవర్ సర్కిల్ ప్రాంతం



కోరుట్ల ప్రకాశం రోడ్డుపై నిలిచిన నీరు

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటు న 11.45 మిల్లీ మీటర్ల వర్షం పడింది. అత్యధికంగా మేడిపల్లిలో 68.8 మిల్లీ మీటర్లు, జగిత్యాలలో 60.8, అత్యల్పంగా రాయికల్‌లో 0.5, కొడి మ్యాల మండలం తిరుమలాపూర్‌లో 1.3 వర్షం కురిసింది. పొలాసలో 58.5 మిల్లీ మీటర్లు, కోరుట్ల, పెగడపల్లిలో 48.0, మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో 46.3, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 31.0, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 17.5, కొడిమ్యాల మండలం పూడూరులో 15.0, మల్యాల మండలం మద్దుట్లలో 11.0, కథలాపూర్‌లో 8.3, బీమారం మండలం మన్నెగూడెంలో 3.3, గొల్లపల్లి, బీమారం మండలం గోవిందారంలలో 1.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

జగిత్యాలరూరల్ : జగిత్యాల పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లస్థలాల్లోకి నీరుచేరింది. డ్రైనేజీలు నిండి డ్రైనేజీలపై నుంచి వర్షం నీరు ప్రవహించింది. వర్షనీటిలో కాలనీబయటున్న ద్విచక్రవాహనాలు నీట మునిగి కొట్టుకుపోయాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరుచేరి ఇబ్బందిపడ్డారు. మార్కండేయనగర్‌లో రోడ్లపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఇళ్ల ముందున్న వాహనాలు నీట మునిగాయి.

- జగిత్యాల పట్టణంలోని గంజ్‌రోడ్ 44 వార్డులో కురిసిన భారీ వర్షానికి ఇంట్లోకి వర్షం నీరు చేరింది. వంజరి సంఘం నందు గల డ్రైనేజీ కల్వర్టు ఎత్తువల్ల పాంపట్టి శంకరయ్య ఇంటిలోకి వర్షం నీరు చేరింది. ఇంట్లోని వంట గది, బెడ్ రూమ్‌లోకి చేరిన డ్రైనేజీ నీటితో అవ స్థలు పడ్డారు. ఇంట్లో సామగ్రి వర్షపు నీటికి తడిసిపోయాయి. బాధితుల్లో ఒకరు వికలాంగులు వృద్ధురాలు ఉండడంతో తమను ఆదుకో వాలని కోరుతున్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు..

జగిత్యాల మండలం ధరూర్ వద్ద గల జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారి నిత్యం వేలసంఖ్యలో వాహనాలు ప్రయాణించే ఈ రోడ్డు వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రయాణికులు ఇబ్బందికరంగా మారుతుంది. మోస్తారుగా వర్షం పడి తేచాలు రోడ్డుపై నీటితోపాటు ప్రక్కనే నాళా ఉప్పొంగి ఆ నీరంతా వచ్చి రోడ్డు పైకి చేరుతుంది. దీంతో రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎ దుర్కొంటారు.

కోరుట్లలో లోతట్టు ప్రాంతాలు జలమయం

కోరుట్ల : పట్టణంలో బారీ వర్షం కురుసింది. నాలుగు రోజులుగా తీవ్ర ఉక్క పోత భరించలేక ఉన్న పట్టణ వాసులకు సోమవారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం లభించింది. పట్టణంలోని లోతట్టు ప్రాతాలతో పాటు పలు కాలనీలలో వర్షం నీరు రోడ్డుపై ప్రవహిం చడంతో కాలనీ వాసులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పట్టణంలోని పలు కాలనీలు వర్షం నీటితో నిండిపోయాయి. పట్టణంలోని రథాల పంపు కాలనీలోపై నుంచి వచ్చే వరద నీరు మురికి కాల్వలు పూర్తిగా నిండి రోడ్డుపై ప్రవహించడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు.



చెరువును తలపిస్తున్న ధరూర్ రహదారి

నలుగురు డీజే నిర్వాహకులపై కేసు

తంగళ్లపల్లి, ఆగస్టు 19: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో అనుమతి లేకుండా డీజేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఆదివారం రాత్రి జిల్లెల్లలో మూడు డీజేలు, మండల కేంద్రంలోని బాబాజీ కాలనీలో ఒక డిజే సీజ్ చేసి నలుగురు నిర్వాహకులు పోలాడి నవీన్, కోడం పృథ్వి, పంది సాయికుమార్, కోడం ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ దాడులలో ఏఎస్‌ఐ చంద్రమౌళి, కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

శివాలయాల్లో భక్తుల పూజలు



హైకోర్టు జడ్జికి స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ కిరణ్

ధర్మపురి, ఆగస్టు 19: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ నెల కొంది. శ్రావణ మాసంలో మూడవ సోమవారం శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామి వారలను దర్శించుకున్నారు. వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, నిర్వహించారు. సాయంత్రం రామలింగేశ్వర స్వామి వారిని నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు సేవ నిర్వహించారు. పాలెపు ప్రవీణ్‌శర్మ, బూన ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి పూజలు

ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె. శరత్ దంపతులు సోమవారం సాయంత్రం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఘనంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్‌జడ్జి దంపతులకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ ఉన్నారు.

కోటిలింగాలలో భక్తుల సందడి

వెల్గటూర్, ఆగస్టు 19: శ్రావణ మాసం సందర్భంగా మండలం లోని కోటిలింగాల కోటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొన్నది. శ్రావణ మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నాగ రాజు శర్మ, సంజీవ్‌శర్మలు స్వామి వారికి అర్చన, అభిషేకాలు, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వ హించారు. వెల్గటూర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

సోమేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

మల్లాపూర్, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని అతిపురాతనమైన పేరు గాంచిన సోమేశ్వర కొండపైన ఆలయంలోని స్వామి దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ పౌర్ణమి సోమవారం సందర్భంగా ఆలయంలోని శివలింగాన్ని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో సందండి నెలకొంది. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి రుద్రాభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారికి బెల్లంతో తయారు చేసిన వరద పాయసాన్ని సమర్పిం చినంతరం స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులు స్వీకరించారు. నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

ముత్తారం, ఆగస్టు 19: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ మండల కేంద్రంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ... ముత్తారం మండల కేంద్రంలో గంట భీమయ్య అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంట భీమయ్యపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు.

ఊరచెరువులో గుర్తు తెలియని మృతదేహం



కథలాపూర్, ఆగస్టు 19 : మండలంలోని ఊర చెరువులో సోమవారం గుర్తు తెలియని మృత దేహం లభ్యమైందని ఎస్సై నవీన్ తెలిపారు. చెరు వులో శవం తేలి కనిపించగా స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 50 ఏళ్ల లోపు వయస్సున్న వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు తమకు అందజేయాలని ఎస్సై కోరారు.

పెద్దపల్లిలోని హనుమాన్‌నగర్‌లో..



పెద్దపల్లిటౌన్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో సోమవారం ఓ వ్యక్తి గుర్తు తెలియని మృత దేహం లభించినట్లు పోలీసులు తెలిపారు, అతిగా మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు గురై చని పోయినట్టు, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో ఉంచినట్లు తెలిపారు. మృతుడు చామనచాయ రంగులో ఉండి 5.6 ఫీట్ల పొడువు కలిగి జీన్ ప్యాంటు ధరించి ఉన్నట్టు, కుడి చెయ్యి పై మరాఠీ భాషలో పచ్చబొట్లు రాసి ఉన్నట్లు వివరించారు. గుర్తించిన వారు పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లోగాని, 8712 656506, 8712656507లో సంప్రదించాలని సూచించారు.

'ఎల్లంపల్లి' నుంచి తగ్గిన నీటి విడుదల

పెద్దపల్లి/బోయినపల్లి/ ఇల్లంతకుంట, ఆగస్టు 19: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.627 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. సోమవారం ఉదయం 6,731 క్యూసెక్కుల వరద నీరు రాగా, మధ్యాహ్నం వరకు తగ్గుముఖం పట్టడంతో రెండు మోటార్లలో ఒకదానిని నిలిపివేసి ఒక మోటార్‌తోనే నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకిం ఇన్‌ఫ్లో పెరిగింది. ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 3,150 మానేరు, మూలవాగు ద్వారా 840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 16.11 టీఎంసీలకు చేరింది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.12 టీఎంసీల నీరు చేరింది. మధ్యమానేరు ద్వారా సర్జిపూల్‌కు వచ్చిన 3,200 కూసెక్కుల నీటిని ఒక పంప్ ద్వారా రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 11,470 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 49.435 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 4,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

జాడలేని రోడ్డు భద్రతా చర్యలు



● జూలై 12న తెల్లవారుజామున 4 గంటలకు కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ కృష్ణనగర్ కాలనీకి చెందిన పాలాడి సాయికుమార్(26) దుర్మరణం చెందాడు. అతని స్నేహితుడు కత్తెర్ల అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. సాయికుమార్, అరవింద్ బైక్‌పై అల్గునూర్ నుంచి కరీంనగర్‌కు వస్తుండగా కోతిరాంపూర్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన వ్యాన్‌ను వెనుకవైపు ఢీకొన్నారు. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అరవింద్‌ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ పార్కింగ్ లైట్లు వేసుకోకుండా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా రోడ్డు పక్కన పార్క్ చేయడంతో చీకట్లో వ్యాన్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టిందని మృతుడి తండ్రి మహేందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

● జూలై 25న అర్ధరాత్రి కరీంనగర్‌కు చెందిన వ్యాపారి తాటికొండ రమేష్(49) చొప్పదండి నుంచి కరీంనగర్‌కు తన కారులో వస్తుండగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద రోడ్డుపై పార్క్ చేసిన లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

- పార్క్‌చేసిన వాహనాలను ఢీకొని రెండువారాల్లో ఇద్దరి దుర్మరణం
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్....
- పార్కింగ్‌లైట్స్ వేయకుండా డ్రైవర్ల నిర్లక్ష్యం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19: రోడ్లపైనే యథేచ్ఛగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాత్రి వేళ వెనుకవైపు నుంచి వచ్చే వాహనాలు ఢీకొని తరచుగా ప్రమాదలు జరుగుతున్నాయి. కరీంనగర్, శివార్ల లో ఇటీవల జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ రెండు ప్రమాదాలు రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలను రాత్రివేళ వెనుకవైపు నుంచి వాహనదారులు ఢీకొట్టడంతో జరిగాయి. మూడేళ్ల క్రితం అల్గునూర్ పెట్రోల్‌బంక్ వద్ద రోడ్డు పక్కన నిలిపిన లారీని కారు వేగంగా ఢీకొట్టడంతో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇటువంటి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు నిర్దిష్టమైన రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవటంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

● నిబంధనలను పట్టించకోకపోవడంతో..


రాత్రి సమయాల్లో రోడ్లపై, రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలకు పార్కింగ్ లైట్లు వేసి ఉంచాలి. ఈ నిబంధనను డ్రైవర్లు పట్టించుకోక పోవడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులపై దూర ప్రాంతాలకు ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అటువంటి సౌకర్యాలు ఏవీ లేకపోవ డంతో రోడ్డు పక్కన భారీ వాహనాలు నిలిపిన డ్రైవర్లు అందులోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. రాత్రి సమయంలో వెనుకవైపు నుంచి వచ్చిన వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాలు జరుగతున్నాయి. రహదారులకు సర్వీసు రోడ్లు లేక పోవటం, మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకుండా ఓవర్‌టేక్ చేయడం వల్లనే ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

చిల్లర మరిచిపోయారా..
టెన్షన్ పడకండి

టికెట్ వెనుక సెల్ నంబర్‌రాసి ఇస్తున్న కండక్టర్



భగత్‌నగర్, ఆగస్టు 19: టికెట్‌కు సరిపడా చిల్లర తీసుకుని రావాలి... దిగేటప్పుడు చిల్లర తీసుకోండి అంటూ సర్ది చెప్పే కండక్టర్లు ఉన్న ఈ రోజుల్లో టికెట్‌కు సరిపడా చిల్లర లేక పోతే టికెట్ వెనుక డ్యూతో పాటు సంతకం చేసి తన సెల్ నంబర్ రాసి ఇస్తున్నాడో కండక్టర్. కరీంనగర్-2 డిపోలో పనిచేసే వీఎల్ నారాయణ అనే కండక్టర్ బస్సుల్లో రద్దీకి అనుగుణంగా టికెట్లు ఇచ్చి టికెట్‌కు సరిపడా చిల్లర లేక పోతే టికెట్ వెనక ఆ మొత్తంతోపాటు తన సెల్ నంబర్ రాసి సంతకం చేసి ఇస్తున్నాడు. ఎవరైనా ప్రయాణికులు ఆదరా బాదరాగా బస్సు దిగి వెళ్లి పోతే వారు టికెట్ వెనుకాల ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి టికెట్‌ను వాట్సాప్‌లో పంపిస్తే ఆయన డబ్బులను ఫోన్ పే ద్వారా పంపిస్తున్నాడు. వీఎల్ నారాయణను ప్రయాణికులతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ప్రశంసిస్తున్నారు.



టికెట్ వెనుక డ్యూతోపాటు, సంతకం, సెల్ నంబర్‌రాసి ఇచ్చిన కండక్టర్



నీటితో నిండిన రైతు వేదిక ప్రాంగణం

కుంట కాదు.. రైతువేదిక ప్రాంగణం

● నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు ● ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని కోరుతున్న రైతులు

కొడిమ్యాల, ఆగస్టు 19 : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మించిన రైతువేదిక ప్రాంగణం రెండు రోజులుగా కురిసిన వర్షపు నీరు, సమీప పొలాల నుంచి వస్తున్న నీటితో కుంటను తలపిస్తోంది. రైతు వేదిక భవనాన్ని క్లస్టర్ పరిధిలోని రైతులకు సమావేశాలను నిర్వహించుకోవటానికి, రైతులకు శిక్షణ ఇవ్వటానికి, ఒకేసారి సుమారు 250 మంది సమావేశం కావటానికి అనుగునంగా గత ప్రభుత్వం సుమారు 22 లక్షల రూపాయలతో నిర్మించింది. ఈ భవనాన్ని 2021లో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ప్రారంభించారు. పూడూర్ క్లస్టర్ భవనం ముందు ఎక్కువగా మొరం పోస్తే నీరు నిలిచి ఉండేది కాదని పలువురు రైతులు తెలిపారు. నిర్మాణ సమయంలో రెండు మరుగుదొడ్లను నిర్మించారు. ప్రస్తుత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న రైతు నేస్తం వీసీ కార్యక్రమం పూడూర్ క్లస్టర్‌లోనే నిర్వహిస్తున్నారు.

రైతు నేస్తం కార్యక్రమానికి వచ్చే రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బందికి సహాయ పడే అటెండర్‌ను కూడా నియ మించక పోవటంతో భవనం లోపల అపరిశుభ్రంగా ఉంటోంది. నిర్వహణ ఖర్చులు పెరిగి పోవడం చేసిన ఖర్చులకు నిధులు రాకపోవడంతో ఎవ్వరు ముందుకు రావటం లేదని రైతులు తెలిపారు. సమావేశాలకు వచ్చే రైతులకు సౌకర్యంగా ఉండటానికి అదనంగా మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉంది. భవనం చుట్టు ప్రహరీ లేని కారణంగా కోతుల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు తెలిపారు. వర్షం కురిసిన ప్రతి సారి భవన ప్రాంగణం బురదమయంగా మారుతుందని రైతులు తెలిపారు. బురద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులను, సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి
బండ లింగారెడ్డి మాజీ ఉప సర్పంచు పూడూర్



పూడూర్ రైతు వేదిక భవనం ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. భవనం ఎదుట అవసరం ఉన్నం మొరం పోయించి బురద కాకుండా చర్యలు తీసుకోవాలి. అదనంగా మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టాలి.

నిర్వహణ ఖర్చులు అందించాలి : ఏవో జ్యోతి



రైతు వేదిక భవన నిర్వహణ ఖర్చులు అందించాలి. కోతుల బెడద ఎక్కువగా ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రైతు వేదిక భవనానికి అటెండర్‌ను నియమించాలి.



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

గంజాయి విక్రేత అరెస్టు

368 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం

కోరుట్ల, ఆగస్టు 19 : ఉన్నత చదువులు చదివి కన్న వారి కలలను నిజం చేయాల్సిన ఓ బీటెక్ యువకుడు జల్సాలకు అలవాటు పడి చివరికి కటకటాలపాలయ్యాడు. చదువు కోసం ఇంటి నుంచి అమ్మ పంపే డబ్బులను జల్సాలకు వాడి అడ్డదారికి అలవాటు పడి పోలీసులకు చిక్కాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద 368 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల రెండో ఎస్ఐ శ్వేతతో కలిసి సీఐ సురేష్ బాబు వివరాలను వెల్లడించారు. రాయికల్ మండల కేంద్రానికి చెందిన పెనుకొండ గణేష్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. చదువు కోసం తల్లి ఇచ్చే డబ్బులను జల్సాలకు వాడటంతో అవి సరిపోలేదు. దీంతో ఇంకా సంపాదించాలన్న దురాలోచనతో తక్కువ ధరకు గంజాయిని కొని కోరుట్ల పట్టణంతో పాటు పరిసర గ్రామాలలోని గంజాయి అలవాటున్న యువకులకు విక్రయించేవాడు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర రావుల పర్య వేక్షణలో ఎస్ఐ శ్వేత తన సిబ్బందితో పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పైడి మడుగు గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో గణేష్ వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలోని బ్యాగ్‌లో 368 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి పోలీ సులు అతడిని కోరుట్ల పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. రా యికల్ మండల కేంద్రానికి చెందిన యువకుడిగా గుర్తించారు. విచారణలో గ ణేష్ పూర్తి వివరాలు వెల్లడించాడు. గణేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. కేసులో చాక్యచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ శ్వేత, కానిస్టేబుల్స్ పవన్ కుమార్, శ్రీనివాస్, సాగర్‌లను సీఐ అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ సురేష్ బాబు

కొండగట్టులో అధ్వానంగా వాహనపూజల షెడ్డు

- వర్షం వస్తే.. పూజలు నిలిచిపోవడమే!
- ఊడిన రేకులు.. వర్షంలోనే భక్తులు
- ముందుకువెళ్లని నూతన షెడ్డు ప్రతిపాదనలు

మల్యాల, ఆగస్టు 19: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో వాహన పూజలు నిర్వహించే షెడ్డు అస్తవ్యస్తంగా మారింది. షెడ్డు రేకులు ఊడి పూజలకు ఇబ్బందిగా మారుతోంది. కొండగట్టు అంజన్న సన్నిధిలో తమ వాహనాలకు పూజలు చేసుకుంటే ఎంతో శుభప్రదమని భక్తులు కొండంత ఆశలతో పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సు, లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్లు, జేసీబీ తదితర వాహనాలకు పూజలు జరుగుతుంటాయి. అయితే ఆలయానికి కొంత దూరంలో గల వాహన పూజల షెడ్డు ఏళ్లగా మరమ్మతులకు గురి కాగ పట్టించుకోవడం లేదు. రేకులు ఊడి ఉండడం, కోతుల చేష్టలతో అటు భక్తులకు అర్చకులకు అసౌకర్యంగా మారింది. పూజల సమయంలో వర్షం వస్తే వాహనాలు, భక్తులు, అర్చకులు పూర్తిగా తడిచిపోవాల్సిందే. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో వాహన పూజలకు ఆటంకం కలుగుతుండగా వర్షం కురుస్తున్నప్పుడు పూజలు మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా ఆయా వాహనాలతో వచ్చిన భక్తులు వర్షంలోనే నిలుచోవల్సిన పరిస్థితి ఏర్పడింది. షెడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు ఎండకు, వానకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. వాహన పూజల ద్వారా దేవస్థానానికి ఏటా లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతుండగా కనీసం షెడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని వాహనాలకు అనుగుణంగా పెద్ద నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. వై జంక్షన్ ప్రాంతంలో వాహన పూజలు నిర్వహించేందుకు రూ.15లక్షలతో రుపొందించిన ప్రతిపాదనలు ముందుకు వెళ్లడం లేదు. దేవస్థానం అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ఊడిన రేకుల షెడ్డు కింద వర్షంలో భక్తులు

బెల్లంపల్లి చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- వ్యాపారి కారు డ్రైవరే సూత్రధారి
- నలుగురి అరెస్టు
- రూ.24లక్షలు స్వాధీనం

కోల్‌సిటీ, ఆగస్టు 19: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి కారు నుంచి రూ.28లక్షలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. వ్యాపారి వద్ద గతంలో డ్రైవర్‌గా పని చేసిన పటాలవత్ దాస్ అనే వ్యక్తే ఈ చోరీకి పథకం వేసినట్టు పోలీసులు గుర్తించారు. అతని తో పాటు జోగు అలియాస్ పోతుల శివ, ముప్పురు రాజు, పండుగ రాజును సోమ వారం బెల్లంపల్లిలో అరెస్టు చేసినట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.24 లక్షల నగదు, రెండుబైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నా మన్నారు.

సోమవారం పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ అరెస్టు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన బిపిన్ కుమార్ అనే వ్యాపారి వివిధ జిల్లాలకు సరుకులు ఇచ్చి ప్రతీ నెలా కలెక్షన్‌కు వచ్చేవాడు. పెద్దఎత్తున నగదును తీసుకెళ్లేవాడు. అతని వద్ద హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన పటాలవత్ దాస్ (26) డ్రైవర్‌గా పని చేసే వాడు. డ్రైవర్‌గా పని చేసే సమయంలోనే కారుకు డూప్లికేట్ కీ తయారు చేయించుకున్నాడు. తరువాత పని మానేశాడు. బిపిన్ కుమార్ కలెక్షన్‌కు వెళ్లిన సమయంలో అతని కారు నుంచి నగదు చోరీ చేసేందుకు ప్రణాళిక వేసుకున్నాడు. స్నేహితులైన జోగు అలియాస్ పోటుల శివ(25), ముప్పురు రాజు (25), పండుగ రాజు(22)ను కలుపుకొని చోరీకి పథకం వేసుకున్నారు.

ఈ నెల 16న బిపిన్ కుమార్ హైదరాబాద్ నుంచి కలెక్షన్‌కు మంచిర్యాలకు వెళుతున్నాడని తెలిసి రెండు బైక్‌ల్లో అతడిని అనుసరించారు. మంచిర్యాలలో బిపిన్‌కుమార్ బస చేసిన లాడ్జ్ సమీపంలోని గుళ్లో నిందితులు బస చేశారు. తెల్లవారి నలుగురు రెండు బైక్‌లపై వేరువేరుగా డబ్బులున్న కారును వెంబడించారు. 17న బెల్లంపల్లి బజార్ మెయిన్ రోడ్డులోని సత్తన్న ఇడ్లి బండి వద్ద నిలిపి ఉన్న కారును నకిలీ కీ ద్వారా డోర్ తెరిచి మాజీ డ్రైవర్ దాసు, అతని స్నేహితుడు శివ రూ.28 లక్షలు ఎత్తుకెళ్లారు. తరువాత బెల్లంపల్లి సమీపంలోని అడవిలో తల దాచుకున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య నాలుగు టీములను ఏర్పాటు చేశారు.

ఈ టీములు సీసీ పుటేజీలను పరిశీలించగా బైక్‌లపై వచ్చిన వ్యక్తులు నగదు గల బ్యాగును ఎత్తుకెళ్లినట్టు గురించారు. సోమవారం నిందితులు టిఫిన్ చేయడానికి బెల్లంపల్లికి వస్తుండగా ప్రభుత్వ కళాశాల వద్ద తనిఖీల్లో నిందితులు పట్టుబడ్డారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ దేవయ్య, కానిస్టేబుల్ మల్లేషం, మంచిర్యాల సీసీఎస్ కానిస్టేబుళ్ల సతీష్, శ్రీనివాస్‌లకు సీపీ శ్రీనివాస్ రివార్డులు అందజేశారు.



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

శిథిలావస్థలో అబ్బాపూర్ ప్రభుత్వ పాఠశాల



ప్రభుత్వ పాఠశాల

భయాందోళనతో ప్రైవేట్ బడులకు పంపిస్తున్న తల్లిదండ్రులు

చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

గొల్లపల్లి, ఆగస్టు 19: ప్రభుత్వాలు మారినా తమ ఊరి పాఠశాల దుస్థితి మారడం లేదని గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామస్థులు వాపోతున్నారు. సుమారు యాభై ఏళ్ల కిందట నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. అందులో చదువుకోడానికి విద్యార్థులు, పంపించడానికి తల్లిదండ్రులు, విద్యా బోధన చేయడానికి ఉపాధ్యాయులు జంకుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిచిన విద్య సంవత్సరం వరకు కాలం వెళ్లదీశారు. ఇక ప్రాణాలతో చెలగాటమాడదల్చు కోలేదంటూ ఆర్థిక భారం మీద పడుతున్నప్పటికీ ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పాఠశాల భవనం పూర్తిగా నాచు పట్టి, గోడలు, పైకప్పుల పెచ్చులూడి, కిటికీలు పాక్షికంగా ధ్వంసమై బూత్ బంగళాను తలపిస్తోంది. వర్షం పడినప్పుడల్లా పైనుంచి లోపలికి ధారాళంగా కురుస్తున్న వర్షపు నీటితో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. ఒక్కోసారి ఇక్కడ వర్షం పడినప్పుడల్లా పాఠశాలకు సెలవే. ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం, సంబంధిత ఉన్నతాధికారుల ఉదాసీనతా వెరసి విద్యార్థుల తల్లిదండ్రులకు శాపంగా మారింది. దీంతో కొన్నేళ్లుగా పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న నాథులు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మొదటి దఫా పార్టీ సర్పంచ్ ఉన్నప్పటికి నూతన భవనం నిర్మాణానికి నిధుల మంజూరుకు నోచుకోలేదు. గత సంవత్సం వరకు ఎలా గోలా నెట్టుకొచ్చిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ విద్యా సంవత్సరంలో భయాందోళనతో పాఠశాలకు తమ పిల్లలను పంపించడానికి నిరాకరించి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో సంబంధిత విద్యా శాఖ అధికారులు విద్యార్థుల 0 సంఖ్య నెపంతో పాఠశాలను మూసివేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా పాఠశాలకు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా :

ఇటీవల గ్రామంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించిన సందర్భంలో తాజామాజీ సర్పంచ్ పురంశెట్టి పద్మవెంకటేశం తమ గ్రామంలో పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన ప్రభుత్వ విప్ అతి త్వరలో పాఠశాల నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని, ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విప్ హామీతో తమ పాఠశాల పునఃప్రారంభమవుతుందని గ్రామస్థులు కొండంత ఆశతో ఎదిరిచూస్తున్నారు.

భవనం నిర్మించాలి: పురంశెట్టి పద్మ, తాజామాజీ సర్పంచ్,



గ్రామంలో నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్నో కష్టనష్టాలకోర్చి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఊరిలో బడి ఉన్నప్పటికి అది పూర్తిగా కూలిపోయే దశలో ఉంది. దీంతో తల్లిదండ్రులు భయపడి తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తున్నారు. నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంతో కాలంగా ఉన్నతాధికారులకు, అప్పటి ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోలేదు.

విద్యార్థుల లేక పాఠశాలను మూసివేశాం: జమునా దేవి, ఎంఈవో

గత సంవత్సరం వరకు విద్యార్థులు పాఠశాలలో విద్యనభ్యసిం చారు. ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు ఎవరూ పాఠశాలకు రాకపోవడంతో పాఠశాలను మూసివేయించి ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై ఇతర పాఠశాలలకు పంపించాం. పాఠశాల భవనం ప్రమాదభరి తంగా మారడంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పంపించడానికి జంకు తున్నారు. దీని పై సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

పాము కాటుతో యువకుడి మృతి

పాలకుర్తి, ఆగస్టు 19: పాలకుర్తి మండల కేంద్రంలో పాముకాటుతో శాతరాజుల సతీష్(39) ఆదివారం రాత్రి మృతి చెందాడు. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. శాతరాజుల సతీష్(39) టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి సతీష్ తన ఇంటి దగ్గరలోని కిరాణాషాప్‌నకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆయనను పాము కాటువేసింది. గమనించిన చుట్టుపక్కల వారు పామును చంపి, యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు సతీష్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19: కరీంనగర్‌లోని ఖాన్‌పురకు చెందిన నిఖిత్ తస్లీం(35) విద్యుదాఘాతంలో మృతి చెందిందని కరీంనగర్ మూడో టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం తన ఇంటిలోని వాషింగ్ మిషన్‌లో బట్టలు వేసి స్విచాన్ చేయగా విద్యుదాఘాతంతో నిఖిత్ తస్లీం కిందపడిపోయిందని తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించగా వైద్యుల పరీక్షించి మరణించినట్లు వెల్లడించారన్నారు. మృతురాలికి భర్త, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు రాఖీ కడుతున్న సోదరి


బీజేవైఎం నాయకులకు రాఖీ కడుతున్న మహిళ..


జగిత్యాలలో సోదరుడికి రాఖీ కడుతున్న చెల్లెళ్లు


మల్లాపూర్‌లో పోలీసులకు రాఖీ కడుతూ..


రాయికల్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

నువ్వు నాకు రక్ష..నేను నీకు రక్ష

జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య రక్షాబంధన్ వేడుకలు..


ఎంపీ అర్వింద్‌కు రాఖీ కడుతున్న శ్రావణి

జవాన్‌కు రాఖీ కడుతున్న విజయలక్ష్మి


కేటీఆర్‌కు రాఖీ కడుతున్న వసంత


ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

రక్షా బంధన్ వేడుకలను పట్టణ ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక అయిన ఈ పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నీకు నేను రక్ష నాకు నువ్వు రక్ష అంటు ఆడ పడుచులు అన్నదమ్ములకు రాఖీ కట్టారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. హైదరాబాద్‌లో విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రి సీతక్క, రాఖీ కట్టారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్‌కు సోదరి రాఖీ కట్టి రక్షబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్లాపూర్‌లో మహిళలు పోలీసులకు రాఖీ కట్టి తమ అనురాగాన్ని తెలిపారు. ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బోగ శ్రావణి రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రాఖీ పండుగ ఘనంగా జరిగింది. . అక్కా, చెల్లెళ్లు తమ గ్రామాల నుంచి తల్లిగారింటికి చేరుకుని అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. మల్యాలతో పాటు పలు గ్రామాల్లో పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో జంద్యాల దారణ చేశారు.




ధర్మపురిలో సోదరుడికి రాఖీ కడుతూ..


జగిత్యాలలో సోదరుడికి రాఖీ కడుతున్న ఓ సోదరి


కొడిమ్యాలలో భక్తులకు రక్షలు కట్టుతున్న స్వయంసేవకులు


వెల్గటూర్‌లో రాఖీలు కట్టుకుంటున్న చిన్నారులు


మల్యాల మార్కండేయ ఆలయంలో జంధ్యాలధారణ


ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న మాజీ ఎంపీటీసీ

మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

మెట్‌పల్లి, ఆగస్టు 19(ఇబ్రహీంపట్నం): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయం నుంచి ఓంకారేశ్వర ఆలయం వరకు పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. అర్చకులు సంతోష్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు ద్యావనపల్లి రాజారాం, ప్రధాన కార్యదర్శి భీమనాతి సత్యనారయణ, ఉపాధ్యక్షులు శంక్ ఆనంద్, సాంబారి ప్రభాకర్, సంతోష్, గౌతం పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

మెట్‌పల్లి, ఆగస్టు 19(ఇబ్రహీంపట్నం): న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేస్తూ సోమవారం మెట్‌పల్లి న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ప్రాంగణంలో నిరసన తెలిపారు. మెట్‌పల్లి బార్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ తెలంగాణ అడ్వకేట్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న పి.సంతోష్ అనే న్యాయవాదిపై బోరబండ పోలీస్ అధికారి జమాల్ సంతోష్‌ను ఇడ్చుకెళ్లి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం పోలీస్ అధికారి జమాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, న్యాయవాదులు శ్రీనివాస్, హఫీజ్, వినయ్ పాల్గొన్నారు.

రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

● బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

కథలాపూర్, ఆగస్టు 19 : కాంగ్రెస్ ప్రభుత్వం రు. 2 లక్షల రుణ మాఫీ పూర్తి స్థాయిలో చేశామని గొప్పలు చెప్పుకుంటోందని దీనిపై శ్వేతపత్రం విడుదల చేస్తే నిజనిజాలు తెలుస్తాయని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 66 లక్షల రైతులు రుణాలు తీసుకుంటే కేవలం 25 లక్షల మందికి మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. రేషన్ కార్డు లేని వారికి కూడా మాఫీ చేస్తామని చెప్పగా కార్డు లేని వారికి మాఫీ చేయలేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేస్తామని నమ్మించి మోసగించారని ఆరోపించారు. రైతు భరోసా కింద ఎకరానికి రు. 7500 ఇస్తామని చెప్పి ఇప్పటికీ డబ్బులు రైతుల ఖాతాల్లో వేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంకు హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం అలవాటుగా మారిందని విమర్శించారు.

శ్రీవారి సేవలో ఎంపీ అర్వింద్


తిరుపతి వెంకన్నను దర్శించుకున్న ఎంపీ కుటుంబ సభ్యులు

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారి సేవలో నిజామబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ గడిపారు. సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

23న జీపీ షెటర్ల వేలం

ఎలిగేడు, ఆగస్టు 19: ఎలిగేడు గ్రామపంచాయతీ వ్యాపార సముదాయ షెటర్లను ఈనెల 23న బహిరంగ వేలం వేస్తున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి (తహసీల్దార్) స్వర్ణ తెలిపారు వేలంలో పాల్గొనే వారు ఒకటి నుంచి 8షెట్టర్లకు రూ.20వేల డిపాజిట్, 9నుంచి 19షెట్టర్లకు రూ. 5వేల డిపాజిట్ గ్రామ స్పెషల్ ఆఫీసర్ పేరున డీడీ తీసి కార్యాలయం పనివేళల్లో పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


మెట్‌పల్లిలో లూయిస్ చిత్రపటానికి రాఖీ కడుతున్న ఫొటోగ్రాఫర్లు

మెట్‌పల్లి, ఆగస్టు 19 (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి కెమెరా క్లబ్ సభ్యులు పట్టణంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ జన్మదినం, రాఖీ పౌర్ణమి ఒకే రోజు రావడంతో ఆయన చిత్రపటానికి రాఖీ కట్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫొటో గ్రాఫర్‌లు శ్రీనివాస్, రాకేష్‌లను పూలమాలలు, శాలువతో సత్కారించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అధ్యక్షులు శ్రీధర్, ఫొటోగ్రాఫర్‌లు రాంప్రసాద్, ముదం శ్రీనివాస్, చిలువేరి మహేష్, రాకేష్, అరుణ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం గ్రామ శివారులోని ధర్మసాగర్ కాలనీలో కెమెరా క్లబ్ సభ్యులు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ జన్మదినం వేడుకలను ఘనంగా నిర్వ హించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నేమరి ఏసురత్నం, నాయకులు బొబ్బిలి అక్షయ్, మగ్రిపల్లి, మురళి, రాఘవేంద్ర, సురేందర్, లింగం, దీపక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలో సోవారం ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలం లోని ఫొటోగ్రాఫర్లు ఒక్కదగ్గర చేరి లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు బండారి సహదేవ్, కుశనపల్లి రాజేందర్, వేల్పుల రమేష్, వేముల ఉదయ్, సాగర్, నవీన్, సంపత్, రంజిత్, రాజేష్, చందు, శ్రీకాంత్ పాల్గొన్నారు. వెల్గటూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సిరిపురం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శ్రీకాంత్, సహదేవ్, సీతారాములు లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరేందుల మోహన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలో సోమవారం ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను పట్టణ కెమోరా క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలలో రోగులు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమలో కెమార క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: ప్రపంచ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకుని గొల్లపల్లి ఫొటో వీడియో, మిక్సింగ్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపకున్నారు. అధ్యక్షుడు కొల్లూరి స్వామి, సెక్రటరీ గొల్లపల్లి సంతోష్ గౌడ్, జనార్ధన్, గంగాధర్, శేఖర్, శ్రీను, రత్నం రవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ పక్షాన ధర్మపురి పట్టణానికి చెందిన సీనియర్ ఫొటో గ్రాఫర్లు వడ్లూరి రవీందర్, ఉత్తెం పెద్దన్నను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య మాట్లాడుతూ గత కొన్ని ఏళ్ల నుండి ఫొటో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రవీందర్, పెద్దన్న పని తీరు గుర్తించి సన్మానం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, ఉపాధ్యక్షులు అప్పాల రాజలింగం, జోన్ ఛైర్మన్ డాక్టర్ రామకృష్ణ, ట్రెజరర్ సిరుప రాజన్న, ఇనుగంటి వినోద్‌రావు, ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు, పప్పుల శ్రీనివాస్, రంగ హరినాథ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రూ. రెండు లక్షలు రుణమాఫీ

పెగడపల్లి, ఆగస్టు 19 : అర్హత ఉన్న రైతులందరికి రూ. రెండు లక్షలు రుణమాఫీ అవుతుందని రైతులు అధైర్యపడొద్దని పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మండల నాయకులు విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన మేరకు అర్హత కలిగిన ప్రతి రైతుకు రూ. రెండు లక్షలు రుణమాఫీ జరుగుతుందని, కొన్ని సాంకేతిక సమస్యల వల్ల కొందరు రైతుల పేర్లు రుణ మాఫీ లిస్టులో రానప్పటికి బాధపడాల్సిన పని లేదని , ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి రైతు ఇంటికి వెళ్లి అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ చేసి తీరుతుందన్నారు. ప్రతి పక్షాల పార్టీల నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు ఎవరు నమ్మొద్దని అన్నారు. మండల అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, నాయకులు విజయభాస్కర్, సత్తిరెడ్డి, బండారి శ్రీనివాస్, అనీల్, తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.

గుండారంలో వైద్య శిబిరం

కమాన్‌పూర్, ఆగస్టు 19: మండలంలోని గుండారం గ్రామంలో సోమవారం కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 14 మందికి జ్వర బాధితులకు డెంగ్యూ జ్వర పరీక్షలు నిర్వహించగా ఎలాంటి విష జ్వరాలు లేనట్లు నిర్ధారణ అయింది.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబందిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ సత్య ప్రసాద్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 9 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ వివిధ ప్ర భుత్వ శాఖల జిల్లా అధికా రులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటి కప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. వ్యయ ప్రయాలకు ఓర్చుకొని పలువురు బాధితులు జిల్లాకేంద్రానికి వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరుత్సాహానికి గురికావడంతో పాటు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కార దిశగా జవాబు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో కలెక్టర్‌కు గోడు వెల్లబోసుకుంటున్న దరఖాస్తుదారులు

ఘనంగా జంద్యాల పౌర్ణమి వేడుకలు

కోరుట్ల, ఆగస్టు 19 : పట్టణంలోని కోటి నవదుర్గ దేవాలయంలో పద్మశాలి సంఘం అద్వర్యంలో జంద్యాల పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. దేవాలయంలో జంద్యాలతో ప్రత్యేక పూజలను నిర్వహించి పద్మశాలి సంఘ సభ్యులు యజ్ఞోపవీత కార్యాక్రమాన్ని జరిపారు. మార్కండేయ ఉత్సవ విగ్రహంకు ప్రత్యేక పూజలను నిర్వహించి పట్టణంలో శోభయాత్రను జరిపారు. వేదపండితులు ప్రదీప్ శర్మ, శ్రీదర్ శర్మల మత్రోచ్చారణల మధ్య జంద్యాల పౌర్ణమి వేడుకలను జరిపారు. అదే విధంగా పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవాలయాలతో పాటు వివిధ దేవాలయాలలో వేదపండితులు పాలెపు రాంశర్మ, బ్రహ్మణ గారి శంకర్ శర్మ, బహ్మణగారి అరుణ శర్మ, పాలెపు బరద్వాజ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన యజ్ఞోపవీత దారణ కార్యక్రమాలను జరిపారు.

పెగడపల్లి : మండల కేంద్రంలో సోమవారం నూలు పౌర్ణమి వేడుకలను పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి వారి రథయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శకటం ఏర్పాటు చేసి మగ్గం నేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో నూలు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల, గ్రామ పద్మశాలి సేవా సంఘం నాయకులు గాజుల గంగామల్లేశం, గాజుల నర్సయ్య, బోగ గంగాధర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమీషనర్ కట్ల వేణుమాదవ్, , నాయకులు బోగ భూమయ్య, బోగ అశోక్, సిరిపురం మల్లేశం, రమేష్, నాగరాజు, గోపి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


పెగడపల్లిలో మార్కండేయ స్వామి వారి రథయాత్ర, మగ్గంతో శోభాయాత్ర

రెడ్డి సంఘం కార్యవర్గం

మల్యాల, ఆగస్టు 19: మల్యాల పట్టణ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎల్లాల జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బద్దం ఎల్లారెడ్డి, కోశాధికారిగా అల్లూరి అనంతరెడ్డి, ప్రధాన కా ర్యదర్శిగా అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్య దర్శులుగా కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బద్దం రాజే శం, సలహాదారులుగా నేరెళ్ల భూమరెడ్డి, అ ల్లూరి లింగారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మగ్రి నరసింహరెడ్డి, గడ్డం రాజిరెడ్డి, నల్ల శ్రీనివాస్‌రెడ్డి, మారు లింగారెడ్డి, అల్లూరి నరసింహరెడ్డిలు ఎన్నికయ్యారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, ఆగస్టు 19 :మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా సోమవారం కొడిమ్యాలకు చెందిన భక్తులు ఎడుమల రాంరెడ్డి కుటుంబ సభ్యులు గ్రామ స్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి సహస్ర పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి నాగరాజు రమేష్, దాతలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

●మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం గ్రామస్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్ అన్న దానం చేశారు. అంతక ముందు ప్రత్యేక పూజలు, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం, మధ్యాహ్నహారతి, పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాద్యులు ఆదిరెడ్డి, మహిపాల్ మొహన్, శ్రీనివాస్, ఆలయ పూజారి శ్రీనివాస్ పలువురు భక్తులు పాల్గొన్నారు.

అర్హులు గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలి

రాయికల్, ఆగస్టు 19: ప్రజాపాలనలో గృహ జ్యోతి కింద 200 యూనిట్లలోపు కరెంట్ బిల్లుక మాఫీ కోసం దరఖాస్తులు చేసుకోని అర్హులు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. దరఖాస్తుదారులు దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లును జత చేయాలన్నారు.

శివ పార్వతుల శోభాయాత్ర

సుల్తానాబాద్, ఆగస్టు 19: శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్‌లో సోమవారం రాత్రి శివపార్వతులతో కూడిన పల్లకీసేవా నిర్వహించారు. సుల్తానాబాద్ పట్టణం పాత బజార్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం రాత్రి ఆలయ పూజారులు వల్లకొండమఠం మహేష్ రజిత, రమేష్ శైలజ, భద్రయ్య తదితరులతో పాటు భక్త బృందం పల్లకీసేవలో పాల్గొన్నా రు. శివపార్వతులతో కూడిన పల్లకీ ప్రధాన వీదుల గుండా వెలుతుండగా భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శనం చేసుకుని మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అల్లాడి భగవన్, పద్మావతి, శివలీల, భూమక్క, చకిలం రామన్న, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక గుడి మిట్ట దేవాలయంలో కూడా రుద్రాభిషేకాలు నిర్వహించారు.

గుంతలమయమైన రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు

ముత్తారం ఆగష్టు 19: మంథని డివిజన్ పరి ధిలోని రహదారులు పూర్తిగా గుంతల మయంగా మారి ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు బీరుదు గట్టయ్య అన్నారు. సోమవారం ముత్తారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు రోడ్లు బాగాలేవని విమర్శించిన మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలం గడిచినా రోడ్లు మరమ్మతులు చేయించడంలో విఫల మయ్యారన్నారు. అధికారంలోకీ రాక ముందు ఇసుక క్వారీలు లారీల గురించి విమర్శిం చిన మంత్రి శ్రీధర్ బాబు ఇప్పుడు ఒక్కసారి కూడా మాట్లాడకం పోవడం ఏంటని ప్రశ్నించారు. రోడ్ల మరమ్మతులు వెంటనే చేయించాలని, మంథని ఓడేడు రోడ్డును 24 గంట ల్లోగా మర మ్మతు చేయించి మంత్రి తనసమర్ధతను నిరూపించుకోవాలని సూచించారు.